క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఆదివారం పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఎండీ జహీర్, కొరెంగా సుంక్‌రావ్, మెస్రం నాగ్‌నాథ్, సోన్‌కాంబ్లే జితేందర్, పవార్ దుదిరామ్, రోహిదాస్ పాల్గొన్నారు.

నేరడిగొండ: మండల కేంద్రానికి చెందిన ఎస్.మమతకు మంజూరైన రూ.13,500 విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో లబ్ధిదారుడికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో శివారెడ్డి, ప్రీతం రెడ్డి, గులాబ్, సురేందర్, లక్ష్మణ్, భూషణ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీవో సత్యానంద్

ఇచ్చోడ: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. ఆదివారం ముఖరా(బి)లో చేపడుతున్న సర్వేను ఎంపీవో సత్యానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ యాప్‌లో ఇందిరమ్మ ఇళ్ల కోసం నిర్వహిస్తున్న సర్వేలో వారి వివరాలను అప్‌లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఇందిరమ్మ ఇల్లు రానివారు, సొంత స్థలాలు కలిగిన ఉన్న వారి పేర్లను నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే కోసం వచ్చిన పంచాయతీ సిబ్బందికి లబ్ధిదారులు తమ వివరాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్, మాజీ సర్పంచ్ ఆడవ్ మారుతి, తదితరులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో సేంద్రియ సాగు

ఎదులాపురం: సేంద్రియ సాగుకు తక్కువ పెట్టుబడి అవసరం అవుతుందని, రైతులు ఈ రకం సాగుపై దృష్టి సారించాలని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి అన్నారు. ఆదివారం జైనథ్ మండలం కరంజి గ్రామానికి చెందిన రైతు సోమ శ్రీనివాస్ రెడ్డి ఇంటిని సందర్శించారు. వేరుశనగ సాగు చేసి, ఇంటి వద్దే నూనె తీసి అందిస్తున్నారని తెలుసుకొని, గ్రామానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సన్మానం

ఎదులాపురం: సుందరయ్య అంగన్‌వాడీ కేంద్రం టీచర్ రాధ రిటైర్‌మెంట్ సందర్భంగా ఆమెకు ఆదివారం కాలనీవాసులు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఆమె సేవలను కొనియాడారు. శాలువాతో సత్కరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రఘునాథ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

వార్షికోత్సవానికి ఆహ్వానం

నేరడిగొండ: కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ను మండలంలోని కుమారి గ్రామస్తులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కలిసి గ్రామానికి చెందిన పరమహంస సచ్చిదానంద సద్గురు శ్రీశబరి మాతాజీ ఆశ్రమం వార్షికోత్సవానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రం అందజేశారు.

నేరడిగొండ మండలంలోని కుమారి గ్రామానికి చెందిన పరమహంస సచ్చిదానంద సద్గురు శ్రీ శబరి మాతాజీ ఆశ్రమం వార్షికోత్సవానికి హాజరు కావాలని గ్రామస్తులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆహ్వానించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు.

జిల్లా నూతన కార్యవర్గం



సన్మానిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ యూనియన్ జిల్లా కార్యవర్గాన్ని ఆదిలాబాద్‌లోని ఆదివాసీ భవన్‌లో ఆదివారం ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సుంగు, ప్రధాన కార్యదర్శి శ్రీరాం అధ్యక్షతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గేడం శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శిగా కుమురం బాజీరావ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేశ్, పరుశురాం, విలాస్, దివాకర్, అశోక్, శ్రీధర్ తదితరులున్నారు.

వీధికుక్కలకు వింత రోగాలు



వ్యాధి సోకిన వీధి కుక్క

- ప్రబలుతున్న చర్మవ్యాధులు
- నివాసాల్లోకి చొరబడుతున్న కుక్కలు
- నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్న ప్రజలు

బజార్‌హత్నూర్: గ్రామాల్లో వీధి కుక్కలకు సోకుతున్న చర్మవ్యాధులతో ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. గత నెల రోజులుగా వీధికుక్కలకు కొత్త రోగం అంటుకుంది. కుక్కల ఒంటిపై బొచ్చు ఊడిపోవడం, దద్దుర్లు రావడం, చిన్న చిన్న పుండ్లు ఏర్పడుతున్నాయి. పశువులకు లంపీస్కిన్ వైరస్ సోకినట్టే ఉంది. ఈ వ్యాధి ఒక దాని నుంచి మరొకదానికి వ్యాపిస్తుండటం ఆందోళన కలిగిస్తుంది. పశువైద్య సిబ్బంది లెక్కల ప్రకారం మండలంలో 12 వందల కుక్కలు ఉన్నాయి. వీటిలో చాలా కుక్కలకు ప్యారాసైట్ ఇన్ఫెస్టేషన్ వ్యాధి బారిన పడ్డాయి. ఇది రెండు రకాలుగా ప్రభావం చూపుతోంది. వాటి శరీరంపై బొచ్చు ఊడిపోయి గజ్జిలాంటి దద్దుర్లు వస్తున్నాయి. రెండో రకం కొన్ని కుక్కల్లో మాత్రమే కనిపిస్తున్నాయి. వాటి కడుపులో, లివర్‌లో ఇన్‌ఫెక్షన్లు ఏర్పడతాయని పశువైద్యాధికారులు చెబుతున్నారు.

రోగ నివారణకు చర్యలు శూన్యం..

వ్యాధి బారిన పడిన కుక్కలకు ట్రీట్‌మెంట్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదు. ప్రస్తుతం ఈవ్యాధి బారిన పడిన కుక్కలు చనిపోకున్నా.. వాటి ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోంది. దాదాపు ఆరు నెలల పాటు వైరస్ వాటి శరీరంపై ప్రభావం చూపుతుంది. పశువైద్యశాలలకు మందుల సరఫరా లేక చికిత్స అందించే పరిస్థితి లేదు.

పిల్లలు, వృద్ధులకు ప్రమాదం..

మా ఊరిలో చాలా రోజులుగా కుక్కల శరీరం మీద ఉన్న బొచ్చు ఊడిపోతుంది. రాలిపోయిన చోట పురుగులు ఉంటున్నాయి. ఆ కుక్కలను చూస్తే భయం వేస్తుంది. అవి నివాసాల్లోకి రావడంతో పిల్లలు, ముసలోల్లకు అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉంది.

– గిద్ది చంద్రశేఖర్, బజార్‌హత్నూర్

చర్యలు తీసుకుంటాం

వీధి కుక్కలకు చర్మ సంబంధ రోగాలు వ్యాప్తి చెందిన మాటా వాస్తవమే. ఆ వ్యాధి నివారణకు డెర్మటైటిస్ ఐవర్‌మెక్టిన్ ఇంజక్షన్లను వారం రోజులపాటు ఇస్తే రోగ నివారణకు చర్యలు తీసుకోవచ్చు. వీధి కుక్కలకు ఇంజక్షన్ వేయాలంటే డాగ్ క్యాచర్లు అందుబాటులో ఉండాలి.

– పర్వేజ్ అహ్మద్, పశువైద్యాధికారి, బజార్‌హత్నూర్

పీవీ రావు సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న నాయకులు

నేరడిగొండ: ఉమ్మడి రాష్ట్ర మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు, పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి గడ్డం వెంకట స్వామి(కాకా) మాలజాతికి చేసిన సేవలు చిరస్మరణీయమని మాల సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం పీవీ రావు 19వ, పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి గడ్డం వెంకట స్వామి(కాకా) 10వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కుర్మే నారాయణ స్వామి, నక్క మహేందర్, మద్దెల నారాయణ స్వామి, యాట అనిల్, పట్టేపు మహేందర్, ఆకుల గంగన్న, లస్మన్న, మద్దెల రాజలింగు, కోల రాజు, భద్దుల రాజు, బద్దుల శేఖర్ పాల్గొన్నారు.

బోథ్: మాల మహానాడు వ్యవస్థాపకులు పీవీ వి.రావు వర్ధంతిని ఆదివారం బోథ్ మండల కేంద్రంతో పాటు సొనాల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి బోడ లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ మునీశ్వర్ సోమన్న, ఊశన్న, రవి, రమేశ్, భూమేష్, రవి, బూర్తుల స్వామి, పాముల సంతోష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

‘అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి’



మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ దుర్గం రాజేశ్వర్

ఉట్నూర్‌రూరల్: విద్యుత్‌శాఖ ఉట్నూర్ డివిజన్ పరిధిలో అవినీతికి పాల్పడుతున్న విద్యుత్ శాఖ డీఈ సుభాష్, ఏఈ రోహిదాస్‌లపై చర్యలు తీసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ దుర్గం రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 2023– 24, 2004– 25కు కోటి 35 లక్షలకు టెండర్లు నిర్వహించి అగ్రిమెంట్లు సైతం చేయడం జరిగిందన్నారు. అట్టి పనులను నలుగురు కాంట్రాక్టర్లకు అగ్రిమెంట్లు చేయడం జరిగిందన్నారు. టెండర్ దారులకు సంబంధం లేకుండా ఇతర ప్రాంతాల వారికి పనులు అప్పగించి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎలాంటి చర్యలు లేవన్నారు. అగ్రిమెంట్ చేసినప్పటికీ పనులు కేటాయించక పోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

సబ్‌స్టేషన్ ప్రారంభించేదెప్పుడో?



సిర్సన్న సబ్‌స్టేషన్

- పనులు పూర్తయినా.. ప్రారంభానికి నోచుకోవడం లేదు
- ప్రారంభిస్తే తీరనున్న విద్యుత్ సమస్యలు

బేల: మండలంలోని సిర్సన్న గ్రామ శివారులో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ పూర్తయిన ప్రారంభానికి నోచుకోవడం లేదు. గత జూన్‌లోనే సబ్‌స్టేషన్ పనులు అన్ని హంగులతో పూర్తయింది. ఈనెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ప్రారంభిస్తారని ప్రజలు భావించారు. కానీ ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. గ్రామాల్లో లోవోల్టేజీ, విద్యుత్ అంతరాయ సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ. 1కోటి 54లక్షలు మంజూరు చేసింది. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ఒక ఏడాదిలోనే గత ఆరునెలల క్రితమే పూర్తయ్యాయి. దీంతో ఇక్కడి నుంచి విద్యుత్ సరఫరా ఇచ్చే గ్రామాలకు లోవోల్టేజి, విద్యుత్ అంతరాయ సమస్యలు త్వరలోనే తీరనున్నాయి.

తీరనున్న లోవోల్టేజీ సమస్య..

ఏళ్లుగా విద్యుత్ సరఫరా కోసం మండలం మొత్తంగా 55 గ్రామాలకు మండల కేంద్రంలో ఒకే సబ్‌స్టేషన్ ఉండేది. ఈక్రమంలో పెరిగిన విద్యుత్ వినియోగం ఆధారంగా లోవోల్టేజీ, విద్యుత్ అంతరాయ సమస్యల పరిష్కారం దిశగా గత ప్రభుత్వం చప్రాల, సాంగిడి గ్రామాల్లో నూతన సబ్‌స్టేషన్లను ప్రారంభించింది. మిగతా 22 గ్రామాలకు సరఫరా ఇంకా మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలోనే కొనసాగుతోంది. ప్రస్తుతం సిర్సన్న సబ్‌స్టేషన్ ప్రారంభమైతే మండలంలోని సబ్‌స్టేషన్ల సంఖ్య 4కు చేరనుంది. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో సరఫరా కోసం సిర్సన్న టౌన్, సిర్సన్న ఏజీఎల్(వ్యవసాయం) రెండు ఫీడర్‌లు ఏర్పాటుకానున్నాయి. ఒకటో ఫీడర్ పరిధిలో భాగంగా సబ్‌స్టేషన్ నుంచి సిర్సన్న గ్రామానికి ప్రత్యేక విద్యుత్ సరఫరా ఉండనుంది. రెండో ఫీడర్‌లో భాగంగా సిర్సన్న ఏజీల్ పీడర్ పరిధిలో సిర్సన్న, సింగాపూర్, బాది, అవాల్‌పూర్ రెవెన్యూ శివారుల్లో వ్యవసాయానికి త్రీఫేజ్ సరఫరా ఉండనుంది.

బాల్యవివాహం చేయవద్దు



మాట్లాడుతున్న పవర్ యశోద

ఆదిలాబాద్‌రూరల్: బాల్య వివాహాలతో జీవితం అక్కడే ముగిసిపోతుందని మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ పవర్ యశోద అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ దళితాభివృద్ధి శాఖ బాలికల వసతి గృహంలో షూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, బాల కార్మికుల నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ కోసం 1098, 100, మహిళల కోసం 181 హెల్ప్ లైన్ నంబర్‌లు, షీటీం సభ్యులు 24 గంటల పాటు పని చేస్తున్నాయన్నారు. ఆడపిల్లల కోసం ప్రత్యేక రక్షణ చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. షూర్ ఎన్జీవో రూపొందించిన బాల్య వివాహ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం కేస్ వర్కర్ నాగమణి, గంగాదేవి, రోహిణీ, షూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ వినోద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ తోట సుమలత, తదితరులు పాల్గొన్నారు.

స్వెటర్లు పంపిణీ

తలమడుగు: మండలంలోని దేవాపూర్ గ్రామంలో ఆదిలాబాద్ చెందిన రామకృష్ణ గౌడ్ దంపతులు ఆదివారం గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు స్వెటర్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చలి తీవ్రత ఎక్కువ ఉండడంతో స్వెటర్లు అందించడం జరిగిందన్నారు. మాజీ సర్పంచ్ అబ్దుల్లా, అబ్దుల్లా గణేష్, రాజేశ్వర్, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

‘అమిత్‌షా రాజీనామా చేయాలి’



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

తలమడుగు: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా మంత్రి పదవికి రాజీనామా చేయాలని, మాల సంక్షేమ సంఘం నాయకులు కాంత్రి, గంగన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని సుంకిడి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట హోం మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేశారు. ఆయకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, వెంకన్న యాదవ్, రాకేశ్, నారాయణ, చంటి, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ పట్ల పార్లమెంట్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అంబేడ్కర్ ఆత్మగౌరవ ఉమ్మడి ఉద్యమ కార్యాచరణ కమిటీ నాయకులు అగ్గిమల్ల గణేష్ డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు గోడం గణేష్, నజీర్ అహ్మద్, సాజిదొద్దిన్, మౌలానా అస్లాం, షేక్ శిరాజ్, ఖలీల్ అహ్మద్, సందీప్, ప్రశాంత్, దయాకర్, రత్నపురం రమేశ్, అర్పత్ ఖాన్, సంతోష్, మనోజ్, అనిల్ పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత బ్రహ్మోత్సవాలు



పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో సంతోషిమాత ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. గత వారం రోజుల కింద ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ఉదయం 5 గంటలకు మహాభిషేకం నిర్వహించారు. 9.30 గంటలకు అమ్మవారి పాదుకలతో పల్లకిని పట్టణంలో ప్రధాన విధులు గుండా ఊరేగించారు. రెడ్డి కాలనీ నుంచి ఆలయం వరకు అమ్మవారికి పట్టు వస్త్రలను ఊరేగింపుగా తీసుకవచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు అనురాజ్‌రెడ్డి, కార్యదర్శి నిమ్మల గోవర్ధన్ రెడ్డి, సభ్యులు శివకుమార్‌రెడ్డి భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ సరఫరా ఏర్పాటుకు చర్యలు



విద్యుత్ పరికరాలు

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలో రూ.3.5 కోట్లతో నిర్మించిన కేజీబీవీ నూతన భవనానికి విద్యుత్ సరఫరా ఏర్పాటుకు విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. భవనం నిర్మించి నెలలు గడుస్తున్నా కేజీబీవీకి విద్యుత్ సౌకర్యం లేక భవనం ప్రారంభానికి నోచుకోలేదు. నూతన భవనానికి విద్యుత్ సరఫరా కోసం అధికారులు రూ.9.9 లక్షల డీడీని విద్యుత్‌శాఖకు చెల్లించారు. కాగా భవనానికి విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే ప్రత్యేక విద్యుత్ లైన్ కోసం విద్యుత్ స్తంభాల ఏర్పాటు పూర్తి చేశారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.

‘సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా’



మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

ఉట్నూర్‌రూరల్: గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీల సమస్యలను ప్రభుత్వం తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట వారం రోజులుగా సమ్మె చేస్తున్న సీఆర్టీలకు భరోసా కల్పించడానికి సమ్మె శిబిరాన్ని సందర్శించారు. సీఆర్టీలకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉద్యోగాలు కల్పించిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. సమ్మె చేస్తున్న సీఆర్టీలకు టీపీటీఎఫ్ మద్దతు తెలిపారు.

ఘనంగా గణిత దినోత్సవం



శ్రీనివాస రామానుజన్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని కేస్లాపూర్, వడగామ్, పిట్టబొంగరం గురుకుల పాఠశాలలో ఆదివారం శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూతబడిన పాఠశాలలు..!



మూతబడిన మల్కుగూడ టీడబ్ల్యూపీఎస్

- సమ్మెలో సీఆర్టీలు
- టీడబ్ల్యూపీఎస్‌లకు తాళాలు
- చదువుకు దూరమవుతున్న విద్యార్థులు

ఇంద్రవెల్లి: ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీడబ్ల్యూపీఎస్‌లలో కాంట్రాక్ట్ బేసిక్‌పై గత 20 సంవత్సరాలుగా చదువు చెబుతున్న సీఆర్టీలు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 16 నుంచి ఐటీడీఏ ఎదుట సమ్మె చేస్తున్నారు. వారు విధులు నిర్వహిస్తున్న పాఠశాలలకు ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులు లేక మారుమూల ప్రాంతంలో పలు గ్రామాల పాఠశాలలకు తాళాలు దర్శనమిస్తున్నాయి. వారం రోజులుగా సీఆర్టీలు విధులకు హాజరు కాకపోవడంతో తమ పిల్లలు చదువుకు దూరమవుతున్నారని, ఆయా గ్రామాల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించాలని కోరుతున్నారు.

నష్టపోతున్న విద్యార్థులు

మండలంలోని మారుమూల గ్రామాల్లో పలు టీడబ్ల్యూపీఎస్ ప్రాథమిక పాఠశాలలు బోసిపోతున్నాయి. ఇటు చదువు చెప్పే సీఆర్టీలు లేక తాళాలు వేసి దర్శనమిస్తున్నాయి. ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాటగూడ, జెండగూడ, నవగూడ, గట్టెపల్లి, సితగూడ, లంబాడాతండా టీడబ్ల్యూఎస్ పాఠశాలలో 65 మంది విద్యార్థులు చదువుతున్నారు. కేస్లాపూర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని తుమ్మల్‌ఫాడ్, లచ్చింపూర్. రాజన్‌పేట్ ప్రాథమిక పాఠశాలలో 72 మంది విద్యార్థులు చదువుతున్నారు. అదే విధంగా మండలంలోని పిట్టబొంగరం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని మల్కుగూడ, రాంలింగంపెట్, లాల్‌టెకిడి, హీరాపూర్, ధర్మగూడ, గోపాల్‌పూర్‌తో పాటు సిరికొండ మండలంలోని ముత్యంపెట్, కన్నాపూర్, కన్నాపూర్‌గూడ, ధర్మసాగర్, కోలాంగూడ, చిమన్‌గూడ, వాయిపెట్, సూర్యపెట్, సాత్‌మోరి, చింతగూడ గ్రామాల్లోని టీడబ్ల్యూఎస్ పాఠశాలలో సుమారు 250కిపైగా గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. కానీ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న సీఆర్టీలు సమ్మె బాటపట్టడంతో పాఠశాలలు మూత పడ్డాయి. వెంటనే పాఠశాలలకు ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న కులస్తులు

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందుతుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మాంగ్ సమాజ్ కులస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషనులో సీఐ భీమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు కుశాల్, విఠల్, మారుతి, బాలాజీ, లహుదాస్, రమేశ్, సంజీవ్, సచిన్, కరుణాకర్ పాల్గొన్నారు.